ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.0
కనిష్ఠం 17.2

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

గురువారం 4 డిసెంబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579.50 (281.5680)	15,445	15,445
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.76 (4.40)	727.42	171.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	640.62	702.43

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

మన కులపోళ్ల.. ఓట్లెన్ని?

- 'సామాజిక' విశ్లేషణలో అభ్యర్థులు
- మెజార్టీ ఓటర్లపై నజర్
- గెలుపే లక్ష్యంగా పంచాయతీల్లో పాగా
- ఓట్ల లెక్కల్లో మునిగిన అభ్యర్థులు



ఊరంటేనే కులం, వర్గం. ఒకనాడు ప్రేమ, ఆప్యాయత, అనురాగం విలసిల్లిన పల్లెల్లో నేడు కులాలు, మతాలు రాజ్యమేలుతున్నాయి. పంచాయతీ ఎన్నికలంటే గుర్తొచ్చేది కులపాళ్ల ఓట్లు. మన కులం ఓట్లు ఎన్ని ఉన్నాయి. పక్క కులపాళ్ల ఓట్లు ఎన్ని, మనకు పడే ఓట్లు ఎన్ని.. ఇలా సామాజిక విశ్లేషణలో అభ్యర్థులు మునిగి తేలుతున్నారు. పలు గ్రామాల్లో మెజార్టీ కులాలకు సంబంధించిన సంఘాల పెద్దలను కూడా ప్రసన్నం చేసుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. పేరుకే రాజకీయరహిత ఎన్నికలైనప్పటికీ, పార్టీ గుర్తు తప్ప.. అందరూ కూడా ఏదో ఒక పార్టీ మద్దతుతోనే ఎన్నికల రంగంలోకి దిగుతున్నారు. ఇప్పటికే పల్లెల్లో ప్రధాన పార్టీలు తమ మద్దతుతో బరిలో నిలిపేందుకు అభ్యర్థులను ఖరారుచేశాయి. మొదటి, రెండో విడత ఎన్నికలు జరుగుతున్న మండలాల్లోని గ్రామాల్లో ఇప్పటికే అన్నిపార్టీలు అభ్యర్థులు ప్రకటించగా, మూడో విడతలో నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. చివరి విడతలోనూ తమ పార్టీల మద్దతుతో సర్పంచ్, వార్డుసభ్యులుగా అభ్యర్థులను ఖరారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. స్థానికసంస్థల ఎన్నికలను అన్ని పార్టీలు కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. తమ పార్టీల మద్దతుతో పోటీచేసే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. అయితే అన్ని పార్టీలు కూడా సామాజిక కోణంపై దృష్టి సారించాయి. మొత్తం 427 గ్రామపంచాయతీల్లో 3,704 వార్డులు ఉన్నాయి. వీటిలో ఎస్టీ కేటగిరీలో 177 వార్డులు మహిళలకు, 192 జనరల్ రిజర్వ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ మహిళలకు 241 వార్డులు, ఎస్సీ జనరల్ 395 వార్డులు, బీసీ కేటరీల్లో మహిళలకు 397 వార్డులు, 572 జనరల్, జనరల్ మహిళలకు 789 వార్డులు, జనరల్ కింద 945 వార్డులు రిజర్వేషన్లు కల్పించారు. ఎన్నికల్లో ఓట్లను పొందేందుకు లెక్కలు వేస్తున్నారు. గ్రామాల్లో రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులు పోటీలో ఉండగా.. ఏయే సామాజిక వర్గాల ఓట్లు ఎంత మేరకు ఉన్నారు? ఎన్నికల్లో వీరి ఓట్ల ప్రభావంతో ఎంత? ఏ పార్టీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది? తమ మద్దతుతో పోటీ చేసున్న అభ్యర్థులకు అనుకూలంగా ఓటర్లను తిప్పుకోవడం ఎలా? అన్న అంశాలపై స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల నేతలు విశ్లేషణల్లో నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులంతా కూడా ఓట్ల లెక్కల్లో మునిగిపోయారు. అయితే పలు గ్రామాల్లో మెజార్టీ కులాలకు సంబంధించిన సంఘాల పెద్దలను కూడా ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈమేరకు ఆయా పార్టీల్లోని నేతలతో గ్రామాల్లోని పరిస్థితిపై కులసంఘాల పెద్దలతో సంప్రదింపులు కూడా జరిగినట్లు తెలిసింది. చాలా గ్రామాల్లో బీసీలు అధిక శాతం. మిగతా 8వ పేజీలో..

అసమ్మతి రాగం షురూ..

సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగానే పలు పార్టీల్లోని నేతల్లో అసమ్మతి రాగం అందుకుంది. స్థానిక ఎన్నికల్లో పోటీచేయాలని ఆశలు పెంచుకున్న నేతలు పార్టీ పెద్దలతో అసమ్మతి రాగం వినిపించినట్లు తెలిసింది. బీసీ, ఎస్సీలకు రిజర్వుడు అయినా స్థానాల్లో తమ సామాజికవర్గాలకు అవకాశం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యేలు, నేతలకు వివరించినట్లు సమాచారం. పార్టీలో సీనియర్‌నేతలు సూచించిన మేరకు తమ మద్దతు ఫలానా వ్యక్తులకు ఇస్తున్నామని తెలియజేస్తుండటంతో, మిగతా ఆశావహులు అధిష్ఠానం వద్ద అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. వారికి సర్దిచెప్పే పనిలో పార్టీ నేతలు నిమగ్నమయ్యారు.

ముగిసిన మొదటి విడత ఉపసంహరణ

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్‌ల ఉపసంహరణ బుధవారం ముగిసింది. మొదటి విడతలో జిల్లాలో మొత్తం 153 సర్పంచ్ స్థానాలకు, 1286 వార్డు స్థానాలకు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం జిల్లాలోని తుర్కపల్లి, రాజాపేట, ఆలేరు, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, ఆత్మకూరు మండలాల్లో 568 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు. అదేవిధంగా 2,899 మంది వార్డు స్థానాలకు పోటీ చేయనున్నారు.

ఏకగ్రీవ పంచాయతీలు

జిల్లాలో 10 సర్పంచులు, 191 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లాలోని తుర్కపల్లిలో 3, యాదగిరిగుట్టలో 2, బొమ్మలరామారంలో 3, ఆత్మకూరులో 2 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆలేరు మండలంలో 6, ఆత్మకూరులో 25, బొమ్మలరామారంలో 51, రాజాపేటలో 11, తుర్కపల్లిలో 72, యాదగిరిగుట్టలో 26 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

13 సర్పంచులు ఏకగ్రీవం

యాదగిరిగుట్ట మండలం చిన్న గౌరాయపల్లి, మైలారిగూడెం, బొమ్మలరామారం మండలం లక్ష్మితండా, రామస్వామి తండా, రామలింగంపల్లి, గోవిందు తండా, ఆత్మకూరు మండలం ఉప్పలపాడు, రాయిపల్లి, తుర్కపల్లి మండలం వెలుపల్లి, గుజ్జవానీవాణికుంట, కోనాపూర్, రామోజీ నాయక్ తండా, చోకులతండా.

మూడో విడత షురూ

- నోటిఫికేషన్ జారీచేసిన జిల్లా యంత్రాంగం
- 124 గ్రామపంచాయతీలు, 1,086 వార్డులకు ఎన్నికలు



యాదాద్రి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో మరో ఘట్టం ప్రారంభమైంది. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో భాగంగా మూడో విడతలో జరిగే గ్రామపంచాయతీల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 6న నామినేషన్ పత్రాల పరిశీలన, అర్హత గల నామినేషన్ల జాబితా విడుదల, 5న నామినేషన్లపై అభ్యంతరాల స్వీకరణ, 6న అభ్యంతరాలపై వచ్చిన అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. 9న నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా విడుదల, 17న పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీల్లో 3,704 వార్డులు ఉన్నాయి. మూడో విడతలో భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో 124 గ్రామపంచాయతీలు, 1,086 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, అడ్డగూడూరు, మోత్కూరు, గుండాల, మోటకొండూరు మండలాల్లో ఎన్నికలు జరుగుతాయి. ఈమేరకు జిల్లా యంత్రాంగం నామినేషన్ల స్వీకరణతోపాటు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

దివ్యాంగులు హక్కులను వినియోగించుకోవాలి

- కలెక్టర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు వారి హక్కులను వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగుల యూడీఐడీ కార్డుల జారీలో రాష్ట్రంలో జిల్లా ఆరో స్థానంలో ఉందని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ సైకిల్, ట్రై సైకిళ్లను అందజేస్తామన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులైన వారు వినియోగించుకోవాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో దివ్యాంగులకు కూడా జాబ్‌కార్డులను అందజేస్తామన్నారు. అదేవిధంగా దివ్యాంగులందరూ సదరం క్యాంపులను వినియోగించుకొని వివిధ రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ రామకృష్ణ, ఏపీడీ జంగారెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ పాండు నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

మోటకొండూరు: మండలంలోని కాటేపల్లి, మోటకొండూరు గ్రామాల్లోని ఎన్నికల ప్రక్రియలో నామినేషన్లలో భాగంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతోపాటు మండలంలోని కాటేపల్లి, నాంచారిపేట గ్రామాల్లోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మండలంలో ఆరు క్లస్టర్ల పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. మొదటిరోజు 20 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌లకు 23, వార్డు సభ్యులు 170కి 46మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్‌వేసే సమయంలో నియమ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు తీసుకొచ్చారా? అని పరిశీలించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఇందిర, తహసీల్దార్ నాగదివ్య, ఎస్ఐ అశోక్ ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ఊరేగింపు



ధ్వజస్తంభాన్ని తరలిస్తున్న భక్తులు

భువనగిరి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో నూతనంగా ప్రతిష్ఠిస్తున్న రాతి ధ్వజస్థంభం ఊరేగింపుగా మంగళవారం వైభవంగా సాగింది. మేళతాళాలతో ఆలయ ప్రాంగణానికి తరలించారు. మార్గమధ్యలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ధ్వజస్తంభానికి పూజలు చేశారు. నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో ఆలయ వైభవం మరింత పెరుగుతుందని భక్తులు తెలిపారు. ధ్వజస్తంభ దాతలు చెన్న స్వాతీ మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరి రాజు, ఆలయ ప్రధాన పూజారి కప్పగంతుల నాగరాజు శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

అడ్డగూడూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. బుధవారం అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి, చౌళ్లరామారం ఎన్నికల క్లస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ల దరఖాస్తు స్వీకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. నామినేషన్లకు ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌డెస్క్ వినియోగించుకోవాలన్నారు. నామినేషన్ ఫామ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో సర్పంచులకు మొదటి రోజు 20 మంది, వార్డు స్థానాలకు 40 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శేషగిరిరావు, ఎంపీడీవో శంకరయ్య, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది

- పొడిచేడు బిడ్డ కావడం గర్వకారణం
- ఎమ్మెల్యే సామేలు



పొడిచేడులో శ్రీకాంతాచారి విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలి దశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి ప్రాణత్యాగం మరువలేనిదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శ్రీకాంత్‌చారి వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని పొడిచేడు గ్రామంలో శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున శ్రీకాంతాచారి వర్ధంతిని భారీగా నిర్వహించలేకపోయామన్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినప్పుడు పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడంతో కలత చెందిన శ్రీకాంత్‌చారి ఆత్మాహుతికి పాల్పడ్డారన్నారు. సాయుధ పోరాటం నుంచి తెలంగాణ మలి ఉద్యమం వరకు ఎందరో పోరాట యోధులు అమరులయ్యారన్నారు. తెలంగాణ మలి ఉద్యమం తొలి అమరుడు శ్రీకాంత్‌చారి పొడిచేడు బిడ్డ కావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడంతో అమర వీరుల త్యాగం ఫలించినట్లయ్యిందన్నారు. కార్యక్రమంలో మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ జిట్ల లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులకు నెలకు రూ.25వేల పింఛన్ ఇవ్వాలి

తెలంగాణ మలిదశ విద్యార్థి ఉద్యమకారులకు నెలకు రూ.25 వేలు పింఛన్ ఇవ్వాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. బుధవారం హైస్కూల్ చౌరస్తాలో శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నోముల రమేష్, శివార్ల శ్రీనివాస్, పోచం కన్నయ్య, బుంగ నవీన్, ముత్తయ్య, లక్ష్మీ, యాదయ్య పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించరా?

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా
- కాసోజు శంకరమ్మ

మోత్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించే వారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూడేళ్లగా శ్రీకాంతాచారి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించడం లేదని శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ ఆరోపించారు. శ్రీకాంత్‌చారి వర్ధంతి రోజు బుధవారం పొడిచేడులో విలేకరులతో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న తాను కొన్ని కారణాల వల్ల కాంగ్రెస్‌లోకి వెళ్లానని, తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌చారి వర్ధంతి నిర్వహించకుండా అడ్డుపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు శ్రీకాంతాచారి నిప్పంటించుకొని తెలంగాణ తెస్తే, రాష్ట్రంలో పదవులు అనుభవిస్తూ బుగ్గకార్లతో తిరుగుతూ శ్రీకాంతాచారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం పొడిచేడులో శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించాల్సి ఉండగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నియోజక వర్గ ఎమ్మెల్యే సామేలు వర్ధంతి జరుగకుండా చెడగొట్టారని ఆమె ఆరోపించారు. మూడేళ్లుగా తనను ఇబ్బంది పెడుతున్నారన్నారు.

విద్యార్థులు జీవితాలను ఆగం చేసుకోవద్దు

- ఆర్డీవో కృష్ణారెడ్డి, ఏసీపీ శ్రీనివాసనాయుడు
- విద్యార్థిపై దాడి ఘటనపై అధికారుల విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

రాజాపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చదువుకునే విద్యార్థులు, తోటి విద్యార్థులపై దాడులకు దిగి జీవితాలు ఆగం చేసుకోవద్దని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడు అన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిపై జరిగిన దాడిపై బుధవారం వారు విచారణ జరిపారు. సంఘటన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మందలించినట్లు తెలిపారు. పాఠశాలలో ర్యాగింగ్ జరగలేదని విద్యార్థుల మధ్య చిన్న గొడవ మాత్రమే జరిగిందని తెలిపారు. విద్యార్థులు మంచి నడవడిని అలవర్చుకొని ఉత్తములుగా ఎదగాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుకోసం రూ.కోట్లు వెచ్చిస్తుందని, చదువుపైనే దృష్టి సారించాలని, పోటీపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు దురలవాట్లకు లోనయితే, భవిష్యత్ అగమ్య గోచరమవుతుందన్నారు. అన్నదమ్ముల్లా కలసి ఉండి పాఠశాలకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, జోనల్ అధికారి విద్యారాణి, యాదగిరిగుట్ట సీఐ శంకర్‌గౌడ్, ఇంటెలిజెన్స్ సీఐ కృష్ణప్రసాద్, తహసీల్దార్ అనిత, ఆర్ఐ నర్సింహులు, ఉపాధ్యాయులు రాజు, ప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

రాజాపేట మండలకేంద్రంలోని గురుకుల పాఠశాల ఎదుట బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడుకు వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వార్డెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్‌గౌడ్, వర్షిత్, చందు, అక్షయ్, నితిన్, ముజ్జు, మురహరి, నాని, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవతలను అవమానిస్తున్న సీఎం



భువనగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

భువనగిరి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం, మైనార్టీల మెప్పు కోసం సీఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవతలను అవమానిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ఆరోపించారు. హిందూ దేవతలపై సీఎం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం భువనగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో తెలిపిన నిరసనలో ఆయన మాట్లాడారు. పదవిని కాపాడుకునేందుకు పార్టీ అధిష్ఠానాన్ని మెప్పించే ప్రయత్నాలు, ఎన్నికల్లో మైనార్టీల ఓట్లు రాబట్టేందుకు చేస్తున్న కుయుక్తిలో భాగంగానే హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. కానీ హిందువులు చైతన్యం అవుతున్నారనే నిజాన్ని కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు సీఎం గ్రహించలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా సీఎం తన వైఖరిని మార్చుకొని హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రత్నపురం బలరాం, నాయకులు పోతంశెట్టి రవీందర్, మాయా దశరథ, పడమటి జగన్మోహన్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్ గౌడ్, డీఎల్ఎన్ గౌడ్, మంగు నర్సింహారావు, ఆర్ కృష్ణాచారి, ఉడుత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఆలేరు: హిందూ దేవతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి హిందూ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా సెక్రటరీ కామిటికారి కృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డేమాన్ నరేందర్, కిసాన్‌మోర్చా అధికార ప్రతినిధి బండెల సుభాష్ డిమాండ్ చేశారు. సీఎం చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఆలేరులోని రైల్వే గేట్ చౌరస్తా సమీపంలోని హైవేపై బీజేపీ పట్టణ కమిటీ చేపట్టిన రాస్తారోకోలో వారు పాల్గొని మాట్లాడారు. హిందూ దేవుళ్ల ఆశీస్సులతో సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి దేవుళ్లనే విమర్శించడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి దేవతలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదన్నారు. కార్యక్రమంలో నాయకులు బడుగు జహంగీర్, సుంకరి సుజన్ కుమార్, వెంకటేష్, రాజు, సందీప్, వెంకటేష్, నర్సింహులు, మురళీ పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవిలత

- జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి మాధవి లత

భువనగిరి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ పరిష్కారాలకోసం కోర్టు కానిస్టేబుళ్లు శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత అన్నారు. ఈనెల 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌పై బుధవారం భువనగిరిలో జిల్లా కోర్టు కానిస్టేబుళ్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పరస్పర రాజీతో పరిష్కారానికి అవకాశం ఉన్న కేసులను గుర్తించి కక్షిదారులను ఒప్పించాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ బాలాజీ, అంజయ్య పాల్గొన్నారు.

బీబీనగర్: దివ్యాంగులు పథకాలను అందిపుచ్చుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత సూచించారు. బీబీనగర్ మండల ప్రజాపరిషత్ పాఠశాలలో భవిత సెంటర్‌లో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న బోధన, శిక్షణ సదుపాయాలు, పింఛన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా, తన దృష్టికి తేవాలన్నారు. ఇక్కడి భవిత సెంటర్‌లో దివ్యాంగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంఈవో సురేశ్‌రెడ్డి, హెచ్‌ఎం కవిత, డాక్టర్ పావని, సుజాత పాల్గొన్నారు.

పల్లెపోరు.. సోషల్ మీడియా జోరు

- పంచాయతీ ఎన్నికలకు వేదికగా సామాజిక మాధ్యమాలు
- వాట్సప్ గ్రూపుల్లో అభ్యర్థుల ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నాలు



స్వతంత్రంగా ఆలోచిస్తాం

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువత

18 సంవత్సరాల వయసు దాటిన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు కావాలన్న కేంద్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వాల పిలుపు మేరకు ఈ పర్యాయం చాలా మంది యువ ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. పైగా గతంతో పోలిస్తే కేంద్ర ఎన్నికల సంఘం తెచ్చిన సంస్కరణలు, కొత్త సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుని ఓటరుగా నమోదయ్యే అవకాశం ఇవ్వడంతో కొత్త ఓటర్ల సంఖ్య పెరిగింది. ఓటు హక్కు పొందిన కొత్త ఓటర్లు రేపటి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో వారి అభిప్రాయాలు, అనుభూతిని వారి మాటల్లోనే...

• ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

అభివృద్ధి చేసేవారికే ఓటు



నాకు కొత్తగా ఓటు హక్కు రావడం ఎంతో సంతోశంగా ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయిధమని పాఠ్యాంశాల ద్వారా తెలుసుకున్నాను. గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో విశిష్టమైనది. పోటీ చేస్తున్న నాయకుల్లో అభివృద్ధికి పాటుపడేవారిని గుర్తించి వారికి నా తొలి ఓటు వేస్తా. నేను స్వతంత్రంగానే ఆలోచించి నిర్ణయం తీసుకుంటా.

• పాల్వాయి సుదీక్ష, నార్కట్‌పల్లి,

ఓటు హక్కుతో ఓ గుర్తింపు



ఎన్నికల సమయంలో ఓటు వేయాలని రాజకీయ నాయకులు మా కుటుంబ సభ్యులను అభ్యర్థించే సమయంలో ఓటు హక్కు విలువ ఎంతో దగ్గరుండీ గ్రహించాను. ఈ పర్యాయం వచ్చిన ఓటు హక్కుతో నాకు కూడా ఓ ప్రత్యేక గుర్తింపు వచ్చిందని భావిస్తున్నా. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్లు నా ప్రజలు సంతోషంగా, స్వేచ్ఛగా జీవించడానికి వారికి నేను డబ్బులు ఇవ్వలేదని ఓటు అనే ఆయుధాన్ని ఇచ్చాననే వ్యాఖ్యలు నాకు స్ఫూర్తినిచ్చాయి.

• కర్నాటి శ్రీహాసిని, నార్కట్‌పల్లి,

ఓటు వజ్రాయుధం



ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం అందించిన ఓ వజ్రాయుధం. అభివృద్ధి చేయడంతో పాటు ఎవరైతే యువతను ప్రోత్సాహిస్తారో వారికే నా తొలి ఓటు వేస్తా. ఎన్నో ఏళ్ల నుంచి నాకు ఓటు హక్కు ఎపుడు వస్తుందా అని ఎదురు చూశాను. నా పాలకుడిని నేనే ఎన్నుకునే హక్కు నాకు వచ్చిందనే ఓ గౌరవం ఎంతో తృప్తినిచ్చింది. ఓటు హక్కును దుర్వినియోగం చేయకుండా సరైన విధంగా వాడుకుంటా. యువత కూడా ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోకుండా మన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే వాడిని ఎన్నుకోవాలి.

• కొమిరిశెట్టి ఉమేశ్, అమ్మనబోలు,

ఓటు హక్కు కోసం ఎదురుచూశా



నాకు కూడా ఓటు హక్కు ఎపుడు వస్తుందా అని ఎంతో ఎదురు చూసే వాడిని. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఉండే కోలాహలం, రాజకీయ నాయకులు ఓటర్లను పలకరించడం వంటివి చూసి నేను ఎపుడు ఓటరును అయ్యేదనిపించేది. ఓటు హక్కుకు అర్హత రాగానే దరఖాస్తు చేసుకున్నా. తొలిసారిగా గ్రామపంచాయతీ ఎన్నికలకే ఓటు హక్కు వినియోగించడం ఇంకా సంతోషంగా ఉంది.

• కట్టంగూర్ పవన్‌కుమార్, అమ్మనబోలు

పల్లెపోరు.. సోషల్ మీడియా జోరు

• పంచాయతీ ఎన్నికలకు వేదికగా సామాజిక మాధ్యమాలు • వాట్సప్ గ్రూపుల్లో అభ్యర్థుల ప్రచారం • ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నాలు

పంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఎక్కువగా పెరగడంతో ఇది ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారింది. సామాజిక మాధ్యమాల వేదికగా 'పంచాయతీ' పోరు రవత్తరంగా మారింది. ఒకటి, రెండో విడతల నామినేషన్ల ప్రక్రియ ముగియడం, మూడో విడత నామినేషన్ల పర్వం మొదలు కావడంతో సోషల్ మీడియా వార్ ఊపందుకుంది.

• ఆంధ్రజ్యోతి, మోత్కూరు



సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోస్టులే కనిపిస్తున్నాయి. ఆయా పార్టీల, అభ్యర్థులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు ప్రత్యక్షమవుతున్నాయి. తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానంటూ అభ్యర్థులు రాసిచ్చిన బాండ్లు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా గ్రూపుల్లో పార్టీ శ్రేణులు, అభ్యర్థుల అనుచరులు యాక్టివ్ అయ్యారు. కార్యకర్తలు, అనుచరులు వివిధ రకాల పోస్టులతో మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రూపుల్లో రాజకీయ చర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఆయా పార్టీలకు సంబంధించిన గ్రూపులతో పాటు గ్రామాలు, కుల, యువజన సంఘాలాంటి పలు గ్రూపుల్లో ఏ గ్రూపు చూసినా ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే కన్పిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఎవరికి వారు పోస్టులు పెడుతూ ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. పార్టీ టికెట్(మద్దతు) ఆశించి భంగపడిన వారు, వారి అనుచరులు పార్టీ నేతలను విమర్శిస్తూ పోస్టులు పెడు తున్నారు. కొన్నిచోట్ల ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాలు బాహాబాహి అన్నట్టుగా విమర్శలు గుప్పిస్తూ పోస్టులు పెడుతుండడంతో అది తమకు కలిసి వస్తుందని ప్రత్యర్థి అభ్యర్థులు సంతోషిస్తున్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా..

పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఖర్చు లేకుండా ఉపయోగపడే సోషల్ మీడియాను ఒక అస్త్రంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాల్లో చిన్నా, పెద్ద అందరికీ మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ఆగ్రామానికి చెందిన ఏదో ఓ గ్రూపులో ఉంటారు. సోషల్ మీడియాలో అను కూల పోస్టులు పెట్టడం ద్వారా ఓటర్లను కొంత మేర ప్రసన్నం చేసుకోవచ్చని భావిస్తున్నారు. అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లు, పాడించిన పాటలు సోషల్ మీడియా పోస్టు చేసి ఓటర్లకు చేరవేస్తున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూపులో వందల మంది ఉంటున్నందున అందులో సగం మంది చూసినా తమకు కొంతైనా ప్రయోజనమే కదా అంటున్నారు.

ఆలోచింపజేస్తున్న పోస్టులు

చలికాలంలో పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది. ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతుండగా ఇప్పటికే సోషల్ మీడియా ప్రచారం జోరందుకుంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి గతాన్ని, గెలిపిస్తే భవిష్యత్‌లో ఆయన చేయబోయే పనులను చూసి ఓటేయాలంటూ చేసే సూచనలు ఆకట్టుకుంటున్నాయి. 'నీ చుట్టూ ఉన్న వాళ్లను నమ్మి పోటీ చేయకు, నమ్ముకున్న వాళ్లే నిన్ను నట్టేటముంచుతారు', 'ఇవి మంచి రోజులు కావు ముంచే రోజులు,' 'ధారళంగా డబ్బులు ఖర్చుచేసి అప్పుల పాలు కావద్దు' లాంటి హితబోధ చేసే పోస్టులు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థితో డబ్బులు ఖర్చు పెట్టించి, తాగి, తింటూ ఎంజా య్ చేసే వర్గం గ్రామాల్లో అక్కడక్కడ కన్పిస్తోంది. గెలుస్తావంటూ ఊదరగొట్టి, తీరా ఓడిపోయాక ముఖం చాటేసే వారూ ఉంటారు. ఆ తరహా వారిని ఉద్దేశించి గ్రూపుల్లో పెడుతున్న పోస్టులు, రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల గురించి, అందులోని లోపాలు ఎత్తిచూపుతూ ఒకరినొకరు విమర్శించుకుంటూ పెడుతున్న పోస్టులు జనాలను ఆలోచింపజేస్తున్నాయి.

గ్రామపాలనలో తమదైన ముద్ర

• 30 సంవత్సరాలుగా సేవలందించిన చంద్రమౌళి కుటుంబం



మచ్చ చంద్రమౌళి, కళావతి, వసంత, శ్రీనివాస్‌గౌడ్

బొమ్మలరామారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామానికి మచ్చ చంద్రమౌళి కుటుంబం సర్పంచ్‌గా 30 సంవత్సరాలుగా సేవలందించింది. గ్రామానికి చెందిన మచ్చ చంద్రమౌళిగౌడ్ తొలిసారిగా 1995, 2001 సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2007లో ఆయన తల్లి మచ్చ కళావతి సర్పంచ్‌గా పనిచేయగా, 2019లో ఆయన సోదరుడు శ్రీనివాస్‌గౌడ్ భార్య వసంతను సర్పంచ్‌గా సేవలందించారు. సోదరుడి బాటలోనే నడవాలనే ఉద్దేశంతో అతని సోదరుడు మచ్చ శ్రీనివాస్‌గౌడ్ ఎంపీటీసీగా 2013లో గెలిచి సేవలందించారు. మచ్చ శ్రీనివాస్‌గౌడ్ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేస్తూ ఆలేరు నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యారు. చంద్రమౌళిగౌడ్, సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచే గ్రామాన్ని అన్ని విధాలు అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో గ్రామ పంచాయతీ నిధులే కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు ఏర్పాటుకు స్థలం, గదుల నిర్మాణానికి సొంతంగా లక్షల రూపాయలు కేటాయించారు. తిరుమలనాథ స్వామి ఆలయం పునర్నిర్మాణం కోసం కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి మచ్చ కుటుంబం ఇప్పటికీ ముందుంటుంది. ఆ గ్రామంలో నేటికీ 30 ఏళ్ల పైగా ప్రజలకు సేవలు అందించి ప్రస్తుత సర్పంచ్ ఎన్నికల్లో అవకాశమున్నా మరొకరికి అవకాం కల్పించారు. మచ్చ కుటుంబంలో రాజకీయంగా గెలుపు అవకాశాలున్నా నేటి ఎన్నికల్లో ఇతరులకు అవకాశం కల్పించామని తెలిపారు.

నర్సింగ్ కుటుంబానిదే హవా

• సర్పంచులుగా తండ్రి, తల్లి, కుమారుడు గ్రామానికి సేవ



నర్సింగు కృష్ణయ్య, సత్తెమ్మ, విజయ్‌కుమార్

నిడమనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరుసగా నాలుగు పర్యాయాలు గెలుస్తూ తండ్రి, తల్లి, కొడుకు ఇలా ముగ్గురు ఆ గ్రామానికి సర్పంచులుగా ఎన్నికయ్యారు. గతంలో గ్రామ సర్పంచుగా భర్త పని చేయగా, అనంతరం భార్య గెలవగా, తర్వాత వారి కుమారుడు కూడా సర్పంచుగా ఎన్నికయ్యారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఊటుకూరు సింగిల్‌విండోకు 1998లో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా గ్రామానికి చెందిన నర్సింగు కృష్ణయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల్లో గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ మేరెడ్డి వెంకటనర్సింహారెడ్డిని ఓడించి ఔరా అనిపించారు. పదేళ్ల చైర్మన్‌గా ఉంటూ రైతుల సంక్షేమం కోసం పనిచేశారు. 2008లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. 2013లో గ్రామ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో గ్రామస్థులు ఆయన భార్య సత్తెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె హయాంలో సైతం గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారు. 2019 ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ పదవి జనరల్‌కు కేటాయించగా వారి కుమారుడు విజయ్‌కుమార్ పోటీ చేసి విజయం సాధించారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన ప్రజాసేవ చేయాలనే తపనతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేశారు. వరుసగా ఒకే కుటుంబానికి చెందినవారు మూడు సార్లు గ్రామానికి సర్పంచులుగా ఎన్నికయ్యారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో కొడుకు కూడా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఊట్కూరు పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది.

జాతీయ అవార్డు వచ్చేలా

• నిర్మల్ పురస్కార్ బి.వెల్లెంల ప్రత్యేకత

• అభివృద్ధిపై మాజీ సర్పంచ్ ధనలక్ష్మి ముద్ర



ధనలక్ష్మి

నార్కట్‌పల్లి, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామం 2007లో కేంద్ర ప్రభు త్వం ఇచ్చే నిర్మల్ పురస్కార్ అవార్డు అందుకొని ప్రత్యేకత చాటుకుంది. 2006 నుంచి 2012 వరకు విద్యాధికురాలైన సోమనబోయిన ధనలక్ష్మి(కాంగ్రెస్ మద్దతుతో) సర్పంచ్‌గా ఎన్నికై పనిచేశారు. సుమారు రూ.10లక్షల అంచనా వ్యయంతో గ్రామంలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇచ్చి సీసీరోడ్లు, మురుగు కాల్వలు, మరుగు దొడ్ల నిర్మించారు. దీంతో బీ.వెల్లెంల గ్రామం నిర్మల్ పురస్కార్‌కు ఎంపిక కాగా 2007 డిసెంబరు 6వ తేదీన మహారాష్ట్రలోని పుణేలో జరిగిన కార్యక్రమంలో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి సర్పంచ్ ధనలక్ష్మి అవార్డు అందుకున్నారు. అనంతరం కర్ణాటక, ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం అప్పట్లో బీ.వెల్లెం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులు పరిశీలించారు. కాగా నిర్మల్ పురస్కార్‌కు ఎంపికయ్యేలా పనిచేసి బీ.వెల్లెంలకు కేంద్ర స్థాయిలో గుర్తింపు తెచ్చేలా పాలన నిర్వహించిన అప్పటి సర్పంచ్ సోమనబోయిన ధనలక్ష్మి ప్రస్తుతం నకిరేకల్ మండలం చందుపట్ల గురుకుల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకు రాలిగా పని చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా ధనలక్ష్మిని పలకరించగా పారిశుధ్య నిర్వహణపై నిర్మల్ పురస్కారం రావడంలో పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ, గ్రామస్థులందరి సహకారం ఉందని చెప్పారు.

మా ఓటు అమ్మకానికి లేదు

• ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన మాజీ వార్డుమెంబర్

నార్కట్‌పల్లి, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): 'మా ఓట్లు అమ్మకానికి కావు.. సేవకులకే మా ఓట్లు..' అని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు దేవరశెట్టి రుక్మిణీ తన నివాసం ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల ఉపసంహరణ ఘట్టం పూర్తై బరిలో ఉండే అభ్యర్థులు ఎవరో తేలిపోవడంతో ప్రచారం ప్రారంభించడమే మిగిలింది. ఓట్ల కోసం వచ్చే నాయకులకు సూచనగా' మా ఓట్లు అమ్మకానికి కావు.. సేవకులకే మా ఓట్లు..' అనే నినాదంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి గ్రామస్థులను ఆలోచించేలా చేస్తున్నారు.



మాజీ వార్డుసభ్యురాలు రుక్మిణీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంక్‌లో కల్తీ పెట్రోల్



బాటిల్‌లో నీళ్లపైకి తేలిన పెట్రోల్

బొమ్మలరామారం, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలోని హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌లో పోయించుకున్న పెట్రోల్ కల్తీగా ఉందని గ్రామానికి చెందిన బాంద్ర ఐలేష్ ఆరోపించాడు. గ్రామంలోని అశోక్ ఫిల్లింగ్ స్టేషన్ పేరుతో ఉన్న హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌లో ఐలేష్ బుధవారం ఒక బాటిల్‌లో లీటర్ పెట్రోల్ పోయించుకున్నాడు. రెండు, మూడు నిమిషాల తర్వాత చూస్తే బాటిల్ పోయించిన పెట్రోల్‌కు బదులుగా కింద భాగంలో నీళ్ల ఉండడంతో ఇదేమిటని నిర్వాహకులను అడిగాడు. తాము కల్తీ చేయలేదని పై నుంచి అలాగే వచ్చిందని సమాధానం చెప్పారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకుండా పోయింది. అక్కడకి వచ్చిన వాహనదారులు ఆరోపించారు. కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నా క్వాలిటీ కంట్రోల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపించారు. కల్తీ పెట్రోల్ చూసి మరికొంత మంది చేసేదేమీలేక వెనుదిరిగారు. కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్న ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

గుండంలో మునిగి బాలుడి మృతి



సంతోష్ మృతదేహం

యాదగిరిగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో కొండ కింద లక్ష్మీపుష్కరిణి(గుండం) నీటిలో మునిగి బాలుడు మృతిచెందాడు. పట్టణ ఇన్స్‌పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన టీకోలు బుజ్జమ్మ తన కుమారుడు సంతోష్(10)తో కలిసి మంగళవారం రాత్రి యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చారు. కల్యాణకట్ట వద్ద రాత్రి బస చేయగా బాలుడు బుధవారం ఉదయం 9 గంటలకు ఆడుకునేందుకు వెళ్లి గుండంలో కాలుజారి పడిపోయాడు. ఊపిరాడక ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లి బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

మహారాష్ట్ర నుంచి వచ్చి ఆళ్లగడప వద్ద పట్టుబడి

• టోల్‌గేట్ వద్ద ఆరు ధాన్యం లారీలు పట్టుకున్న పోలీసులు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తున్న ధాన్యం లారీలను పోలీసులు పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఆలగడప సమీపంలోని టోల్‌గేట్ వద్ద పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టి ధాన్యం లారీలను ఆపి సంబంధిత పత్రాలు పరిశీలించారు. మహారాష్ట్ర, ఖమ్మం, ఇతర ప్రాంతాల నుంచి మిర్యాలగూడ మిల్లులకు వస్తున్న ధాన్యం లారీలను నిలిపివేశారు. సంబంధిత పత్రాలను పరిశీలించి మహారాష్ట్రకు చెందిన ఆరు లారీలను స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. మిర్యాలగూడ ప్రాంతానికి బయటి ప్రాంతాల నుంచి వస్తున్న ధాన్యం లారీలను అడ్డుకునే క్రమంలో రాజకీయ, వ్యాపార వర్గాల నుంచి సంబంధిత అధికారులకు ఫోన్‌కాల్స్ ద్వారా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా అక్రమంగా వస్తున్న బయటి ధాన్యాన్ని అడ్డుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

దొండపాడు వద్ద ఏడు లారీలు

చింతలపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు లారీల్లో ధాన్యాన్ని తెలంగాణకు పంపిస్తున్నారు. ఆంధ్రా ప్రాంతం నుంచి తెలంగాణకు తరలిస్తున్న ఏడు ధాన్యం లోడు లారీలను సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని దొండపాడు వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. గత సంవత్సరం కూడా ఇదే రోజుల్లో వందలాది లారీలను పట్టుకున్న స్థానిక రైతులు తిప్పి పంపారు. చెక్‌పోస్టు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తాజాగా సూర్యాపేట జిల్లాలో ఆంధ్రా ధాన్యం లారీలను పోలీసులు పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీఏ చెక్‌పోస్టులు ఎత్తివేశారు. ఏఎంసీ చెక్‌పోస్టుల వద్ద కూడా సిబ్బంది లేకపోవడంతో ఆంధ్రా పర్మిట్ లారీలు రాష్ట్రంలోకి వస్తున్నా అడ్డుకునే వారు లేరు. ఏడు లారీలను పట్టుకున్న పోలీసులు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆంధ్రా నుంచి లారీలు తెచ్చిన డ్రైవర్లను పోలీసులు ప్రశ్నిస్తే సమాధానం కూడా చెప్పకుండా లారీలను అక్కడే వదిలి వెళ్లిపోయారని ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు.



టోల్‌గేట్ వద్ద పోలీసులు పట్టుకున్న ధాన్యం లోడు లారీలు

రోడ్డు ప్రమాదంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ మృతి

అర్వపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని సబ్‌స్టేషన్ ఆపరేటర్ మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గద్దగూటి మల్లయ్య(46) జాతీయ రహదారిపై సూర్యాపేట వైపు బైక్‌పై వెళ్తుండగా సూర్యాపేట వైపు అతి వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో కాళ్లు, తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇసుక లోడు ట్రాక్టర్ డ్రైవర్ ఢీకొట్టి పరారయ్యాడు. మల్లయ్య నాగారం మండలం పణిగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మల్లయ్యకు భార్య, కుమార్తెలు ఉన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాగారం సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్ఐలు సైదులు, చిరంజీవి అర్వపల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం అర్వపల్లిలో మల్లయ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఇంటి పెద్ద కోల్పోవడంతో భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు.



మల్లయ్య(ఫైల్)

వృద్ధురాలిపై రోకలిబండతో మహిళ దాడి

• నల్లగొండ జిల్లా దేవరకొండలో ఘటన

దేవరకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని గాంధీనగర్‌లో భాగ్యమ్మ అనే వృద్ధురాలిపై బుధవారం గుర్తుతెలియని మహిళ రోకలి బండతో దాడి చేసింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, వృద్ధురాలి కుమారుడు శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలో గాంధీనగర్‌లో శ్రీనివాసాచారితో పాటు భార్య లక్ష్మి తల్లి భాగ్యమ్మను నివాసం ఉంటున్నారు. శ్రీనివాసాచారి ఆయన భార్య బుధవారం విధుల్లోకి వెళ్లారు. ఇంట్లో తల్లి భాగ్యమ్మ ఒక్కతే ఉంది. బుర్కా వేసుకొని వచ్చిన గుర్తుతెలియని మహిళ ప్రవేశించి నీ కోడలు ఇంట్లో ఉందా అని అడిగి పలికరించింది. అనంతరం రోకలిబండతో మహిళ భాగ్యమ్మ తలపై దాడి చేసింది. దీంతో వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టు పక్కల ఉన్నవారు ఇంట్లోకి చేరుకొని లోపే గుర్తుతెలియని మహిళ పరారైంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి తీవ్ర గాయాలైన భాగ్యమ్మను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుమారుడు శ్రీనివాసాచారి బుధవారం రాత్రి దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భాగ్యమ్మ పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. డబ్బుతో పాటు నగల కోసమే మహిళ దాడి చేసిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. వృద్ధురాలు కుమారుడు శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



గాయపడిన వృద్ధురాలు భాగ్యమ్మ

కిడ్నాప్ కేసులో కొనసాగుతున్న విచారణ

• కేసు నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ

తిప్పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ వ్యవహారంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. నవంబరు 29వ తేదీన సర్పంచ్ నామినేషన్ వేసేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ మద్దతుదారు అభ్యర్థి నాగలక్ష్మి భర్త యాదగిరిని అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కిడ్నాప్ చేశారని నల్లగొండ జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన తర్వాత కిడ్నాప్ జరిగిన ప్రదేశం నకిరేకల్ పోలీసుస్టేషన్ పరిధిలోకి రావటంతో కేసును ఆ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశామని ఎస్ఐ శంకర్ తెలిపారు. విచారణలో కిడ్నాప్ ఉదంతంపై నిజానిజాలు, బాధితుడు చెప్పిన విషయాలు, కిడ్నాప్ జరిగిన విషయంలో వాస్తవాలను పోలీసులు విచారిస్తున్నారు.

దామరచర్లలో 38 లీటర్ల మద్యం పట్టివేత



దామరచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో బుధవారం పట్టుకున్నారు. వాడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్‌పాడు గ్రామానికి చెందిన అజ్మీరా వినోద్‌కుమార్, గంధం మహేష్, మెగావత్ నాగా కలిసి మద్యం బాటిళ్లతో గ్రామానికి చెందిన వెళ్లడానికి దామరచర్ల సెంటర్‌లో వేచి ఉన్నారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకొని పరిశీలించగా, రూ.35వేల విలువగల 38.1లీటర్ల మ ద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తుంగతుర్తి, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో 19 కేసులు నమోదు చేసినట్లు సీఐ రజిత బుధవారం ప్రకటనలో తెలిపారు. 17 లీటర్ల సారా, 27 లీటర్ల మద్యం, 24 లీటర్ల బీర్లు, ఒక ద్విచక్ర వాహనం, 1800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.78వేల వరకు ఉంటుందని తెలిపారు. స్థానిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా సారా విక్రయించినా, తయారు చేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



భవిత కేంద్రంలో చిన్నారిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

భవితకు బాట

● ప్రత్యేక అవసరాల పిల్లలకు కొండంత అండ ● భవిత కేంద్రం ఏర్పాటులో జిల్లా ముందంజ

ఆనందాన్ని పంచుకోవాలన్నా.. బాధన చెప్పుకోవాలన్నా... వారిలోని ఆలోచనలు వ్యక్తం చేయాలన్నా వారికి ప్రత్యేకమైన విద్యా విధానం అవసరం. సమాజంలో వేసే ప్రతీ అడుగుకు అంగవైకల్యం అడ్డుకాకూడదనే ఆలోచనతో వారిని మనోస్థైర్యంతో ముందుక వెళ్లేలా ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)



ఫిజియో థెరపీ నిర్వహిస్తూ..

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు నేడు కొండంత అండగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 592 భవిత కేంద్రాలు ఉండగా, నల్లగొండ జిల్లాలో 31 భవిత కేంద్రాలున్నాయి. వాటిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న సందర్భంలో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక భవనాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నూతన భవనాలు నిర్మించారు. జిల్లాలో 30 పాఠశాల భవనాలు అందుబాటులోకి రాగా మాడ్గులపల్లి భవనం మాత్రమే నిర్మాణ దశలో ఉంది. 31 పాఠశాలలకు గాను 519 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయడంతో నేడు ప్రత్యేక విద్యకు ప్రాధాన్యం దక్కింది. విద్యార్థులకు వారంలో రెండు రోజులు ప్రత్యేకమైన వైద్య సిబ్బందితో స్పీచ్, ఫిజియో థెరపి చేస్తుండడంతో విద్యార్థుల్లో శారీరక ఇబ్బందులు కొంతమేరా తగ్గే అవకాశం ఉంటుంది. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆర్గనైజేషన్ ఎలింకో సంస్థనుంచి ప్రతి ఏడాది వైద్య శిబిరం ఏర్పాటుచేసి సహాయ ఉపకరణాలు అందజేస్తుంటారు. భవిత కేంద్రాల్లో అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడిలోపం తదితర 21లోపాలతో బాధపడుతున్న చిన్నారులకు విద్యను అందించడంతోపాటు తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తుంది. దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు నిలుస్తున్నాయి. అలాంటి భవిత కేంద్రాల ఏర్పాటులో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవ తీసుకొని ఒక టీంను ఏర్పాటుచేసి నేడు రాష్ట్రంలోనే భవిత కేంద్రాల ఏర్పాటులో ముందంజలో ఉండేలా విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరుల సమన్వయంతో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు..

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రత్యేకంగా విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో 2006లో మండల రిసోర్స్ టీచర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. సాధారణ పాఠశాలల్లో ఉండే ప్రత్యేక విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ఎంఆర్‌టీలు కృషి చేస్తూనే పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ అందించేవారు. ఎంఆర్‌టీలు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి థెరపి కార్యక్రమాలు చేపడుతూ వారిని ప్రోత్సహించేవారు. 2012లో ప్రత్యేకంగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సర్వశిక్షా అభియాన్, రాజీవ్ విద్యామిషన్ ద్వారా భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సమగ్ర శిక్షపేరుతో సొంత భవనాలు లేని మండలాల్లో భవిత కేంద్రాల భవన నిర్మాణాలను చేపట్టి పాత భవనాలను ఆధునికీకరించి నూతన హంగులతో విద్యార్థులను ఆకర్షించేలా, అన్ని వసతులు, సౌకర్యాలు అందించేలా ప్రభుత్వం కృషి చేసింది.

'భవిత' ఏర్పాటులో జిల్లా ముందంజ

రాష్ట్రంలో ఉన్న 592 భవిత కేంద్రాలను విద్యార్థులకు అనుగుణంగా అధునాతన పద్ధతులతో ప్రత్యేక వసతులను ఏర్పాటు చేసి కళాత్మకమైన హంగులతో భవనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి, తమదైన శైలిలో త్వరగా భవిత కేంద్రాల రూపకల్పనకు కృషిచేసి నల్లగొండ జిల్లాను ముందంజలో నిలిపారు. పక్క జిల్లాల అధికారులు సైతం జిల్లాలోని కేంద్రాలను పరిశీలించేందుకు వస్తుండడం అధికారుల సమన్వయానికి గుర్తింపుగా పేర్కొనవచ్చు.

ప్రధాన ఉద్దేశ్యం

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు శారీరక ఎదుగుదల, మానసిక ఎదుగుదల కోసం థెరపిలు చేసి విద్యాబోధన సాగిస్తుంటారు. చిన్నారులను సాధారణ పాఠశాలల్లోని విద్యార్థులకు సమ్మిళితమయ్యేలా వారిలో ప్రతిభను పెంచేలా చేయడం భవిత కేంద్రాల ప్రధాన ఉద్దేశ్యం. భవిత కేంద్రాల్లో చిన్నారులను చేర్పించే సమయంలో వారిలోని లోపాలను గుర్తించి వారికి అందించాల్సిన థెరఫిల కోసం హెల్త్‌చెకప్‌చేసి సర్టిఫికెట్ ఆధారంగా అవసరమైన చికిత్సలు, ఉపకరణాలు అందిస్తుంటారు. పాఠశాలల్లో అన్నిరకాల ఆట వస్తువులు, ఉపకరణాలు అందుబాటులో ఉంటాయి. ప్రథమ స్థాయి నుంచి పదో తరగతి వరకు, 18 ఏళ్ల వయస్సు వరకు విద్యాబోధన అందిస్తుంటారు. వీరికి అవసరమైన ప్రత్యేక విద్య, అభ్యసన పుస్తకాలు అందుబాటులో ఉంచుతారు. ఐఈఆర్‌పీ (ఇన్‌క్లూజీవ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్)లు విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి సహకరిస్తుంటారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు భవిత కేంద్రాలు నిర్వహిస్తారు. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు భవిత భరోసా కల్పిస్తుందని చెప్పకోవచ్చు.

సామాజిక బాధ్యతను కలిగి ఉందాం



సమాజంలో ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గౌరవించాల్సిన అవసరం ఉంది. వారి అవసరాలకు అనుగుణంగా వారితో మమేకమవుతూ మనలో ఒకరిగా కలుపుకుపోతూ వారిలోని ఆవేదనను గుర్తించి సహకరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేస్తా. భవిత కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తూ ప్రతీ విద్యార్థికి థెరపిలు అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ప్రతీ ఒక్కరిని భవిత కేంద్రంలో నమోదయ్యేలా తల్లిదండ్రులు కృషి చేయాలి. వారికి ఆటో చార్జీలు, ఇతర సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది.

ఇలా త్రిపాఠి, కలెక్టర్, నల్లగొండ

సాధారణ పిల్లలతో పోటీ పడేలా



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను సాధారణ పిల్లలతో పోటీపడేలా తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని వారికి భరోసాగా నిలబడాలి. ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్ అలవెన్స్ అందించడంతోపాటు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, ట్రై సైకిళ్లు తదితర ఉపకరణాలను అందిస్తాం.

నారాయణ్‌అమిత్, సబ్ కలెక్టర్, మిర్యాలగూడ

నిరంతరం అందుబాటులో ఉంటాం



నిరంతరం అందుబాటులో ఉంటూ వారి విద్యావిధానాన్ని పరిశీలిస్తుంటాం. పరిపక్వత చెందని విద్యార్థులను గుర్తిస్తూ వారి మానసిక ఎదుగుదలకు అనుగుణంగా సంబంధిత విద్యా అంశాలను ఎప్పటికప్పుడు అందిస్తాం.

బైరోజు బ్రహ్మచారి, స్పెషల్ టీచర్, మిర్యాలగూడ

నడక నేర్చుకున్నారు



తొమ్మిదేళ్ల క్రితం నడవలేని స్థితిలో ఉన్న మా బాబును భవిత కేంద్రంలో చేర్పించాను. నాడు నిలబడి నడవలేని స్థితిలో ఉన్నాడు. నాటినుంచి భవిత కేంద్రంలో విద్యతోపాటు చేపడుతున్న థెరపిలతో అంచెలంచెలుగా అడుగులువేస్తూ నేడు తన అవసరాలను గుర్తించేలా మానసిక ఎదుగుదలతోపాటు నడుస్తున్నాడు.

జ్యోతి, విద్యార్థి తల్లి, సుబ్బారెడ్డిగూడెం

రాష్ట్ర స్థాయికి సిటీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



సాత్విక్



మానస

సూర్యాపేట టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజ్ఞాన్ మంతన్ (వీవీఎం) జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో రాష్ట్ర స్థాయి పోటీలకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సిటీ హైస్కూల్, సిటీ ఎలైట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల చైర్మన్ ఆర్.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం ఆయన అభినందించి మాట్లాడారు. జాతీయ స్థాయి పరీక్షలో 9వతరగతికి చెందిన సిటీ హైస్కూల్ విద్యార్థి వి.సాత్విక్, 9వ తరగతికి చెందిన సిటీ ఎలైట్ స్కూల్ విద్యార్థిని బి.మానస ఉత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీధర్, కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేష్ మృతికి కారకులపై అట్రాసిటి కేసు నమోదు చేయాలి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హుస్సేన్



కోదాడలో రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు.

కోదాడ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన దళిత యువకుడు రాజేష్ మృతి కి కారకులపై 306, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కింద కేసు నమోదు చేయాలని, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోదాడలో రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లో అక్రమాలు జరిగాయని పోలీసులు రాజేష్‌ను అదుపులోకి తీసుకుని నాలుగు రోజుల పాటు చిలుకూరు, కోదాడ రూరల్ స్టేషన్లలో చిత్రహింసలు పెట్టడం కారణంగానే మృతి చెందాడన్నారు. వెంటనే రిటైర్డు హైకోర్టు జడ్జీ పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.కోటి పరిహారం అందించాలని, లేనట్లయితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడతల శ్రీనివాస్, దాసరి దేవయ్య, లచ్చిమళ్ల రామ్మోహన్‌రావు, గాదరి మధు, కాసిమల్ల వెంకటనరసయ్య, పిడతలశంకర్, ఏపూరి రాజు , కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, వడ్డేపల్లి కోటేష్, ఏపూరి సత్యరాజు, సోమపంగు సురేష్, పాముల శ్రవణ్, రాయల గోపి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి


సూర్యాపేట టౌన్: పోలీసుల కస్టడీలో మృతి చెందిన కోదాడకు చెందిన రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాని ఎంఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్యమాదిగ కోరారు. బుధవారం సూర్యాపేటలోని లోని బాబుజగ్జీవన్‌రామ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ నిధుల కేసుకు సంబంధించి అరెస్ట్ చేసిన రాజేష్‌ను వివిధ పోలీస్ స్టేషన్‌లకు తిప్పుతూ చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే చలో కోదాడ కర్ల రాజేష్ సంతాప సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపాటి చిన శ్రీరాములు, వలపట్ల దయానంద్, బోడ శ్రీరాములు, గార కనకయ్య, బొడ్డు విజయ్‌కుమార్, మేడికృష్ణ, లింగస్వామి, సతీష్ , శ్రీనివాస్, కిరణ్, గోపిచంద్, మనోజ్ పాల్గొన్నారు.

దొరికినా తీరు మారడం లేదు..

● అవినీతి కేసుల్లో పట్టుబడుతున్న అధికారులు ● ఏటా పెరుగుతున్న కేసులు ● ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 15 కేసులు నమోదు ● నేటినుంచి అవినీతి వ్యతిరేక వారోత్సవాలు

ప్రభుత్వం అనేక విధాలుగా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో అవినీతి నిరోధించలేక పోతున్నారు. ఏ శాఖలోనైనా పైసలు ఇవ్వనిదే ఫైలు కదలడంలేదు. ప్రసవించాలంటే ఆసుపత్రుల్లో, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మున్సిపాలిటీల్లో, విద్యుత్ మీటర్, ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ట్రాన్స్‌కోలో, రైతులకు పాస్ పుస్తకాలు కావాలంటే రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖతో పాటు ప్రతి శాఖలో కొంతమంది అవినీతిపరులు ఉంటున్నారు. దీంతో పనులు కాక ప్రజలు సతమతమవుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు ఈఏడాది ఇప్పటి వరకు 15కేసులు నమోదు చేశారు. అందులో పలు కేసులు రెడ్‌హ్యాండెడ్‌గా డబ్బులు తీసుకుంటుండగా కేసులు నమోదు చేశారు. మరో ఆరు ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖ, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. అవినీతి శాఖాధికారులు లంచాలు తీసుకునే అధికారులు, ఆదాయానికి మించి అక్రమ మార్గంలో ఆస్తులు కూడబెట్టుకున్న వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేసి జైలుకు పంపినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగుల్లో మార్పు రావడంలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు నమోదు చేసిన సుమారు 50కేసులు విచారణ విషయంలో పెండింగ్‌లో ఉన్నాయి.

ఈ ఏడాది నమోదైన కేసులు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు అవినీతికి పాల్పడిన అధికారులు, ఉద్యోగులపై 15 కేసులు నమోదు చేశారు. జనవరిలో డిండి మండలంలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ శ్యాంనాయక్, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు, ఫిబ్రవరిలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల సర్వేయర్ రవి, చౌటుప్పల్‌లోని విద్యుత్ శాఖలో ఏడీఈగా పని చేస్తున్న శ్యాంప్రసాద్, సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి, సూర్యాపేట డీఎస్పీ పార్థసారధి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, నల్లగొండలోని సివిల్ సప్లయ్ విభాగంలో పనిచేసే జావెద్, సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్, హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ విజేతరెడ్డి, కోదాడలోని అటవీ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ వెంకన్న, నల్లగొండ జిల్లా మత్స్యశాకాధికారి చరిత, చిట్యాల తహసీల్దార్ గుగులోత్ క్రిష్ణ, ప్రైవేట్ ఉద్యోగి రమేష్, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం జానపహాడ్ పంచాయతీ కార్యదర్శి వింజమూరి వెంకన్న, నల్లగొండ అగ్నిమాపక అధికారి సత్యనారాయణరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట దేవస్థానం ఈఈ వెంకట నారాయణ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అదే విధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా సరిహద్దుల్లో ఉన్న రవాణా శాఖ చెక్ పోస్టులు, పలు సంక్షేమ శాఖలకు సంబంధించిన హాస్టళ్లు, రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

లంచం అడిగితే...

ప్రభుత్వ ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం లంచాలు అడిగితే ప్రజలు జిల్లాలోని అవినీతి నిరోధక శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలి. సదరు ఉద్యోగులపై ఏ విషయంలో ఫిర్యాదు చేసేది లిఖిత పూర్వకంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అక్రమార్గంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడపెట్టిన వారి విషయాలను ఫోన్ ద్వారా తెలియజేస్తే సరిపోతుంది. అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం ఇచ్చిన వారి విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతారు.

ప్రజలు సహకరించాలి

అవినీతిని నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలి. కళాజాతల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గడం లేదు. అవినీతి నిర్మూలన బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడే సాధ్యమవుతుంది. గతంలో నమోదు చేసిన కేసులకు సంబంధించిన కొంత మంది ఉద్యోగులకు ఇటీవల కోర్టుల్లో శిక్ష పడింది. వారం రోజుల పాటు ప్రజలు, విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవ గాహన కల్పించే కార్యక్రమాలు చే పడుతున్నాం. ప్రజలు అవినీతి ఉద్యోగులపై ఫిర్యాదు చేయాలంటే టోల్‌ఫ్రీ నెంబరు: 1064, సెల్: 9154388918లకు ఫోన్ చేయాలి.

● జగదీష్‌చందర్, ఏసీబీ డీఎస్పీ, నల్లగొండ.

శస్త్ర చికిత్సతో గొర్రె పిల్లకు ప్రాణం

కోదాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొట్ట పగిలి పేగులు బయటికి వచ్చిన గొర్రె పిల్లకు శస్త్ర చికిత్సతో ప్రాణం పోసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. పట్టణంలోని కొమరబండ వార్డుకు చెందిన గొర్రెల కాపరి బొమ్మకంటి వీరయ్య గొర్రె నెలరోజుల క్రితం పిల్లకు జన్మనిచ్చింది. మూడు కాళ్లతోనే పుట్టిన ఆ గొర్రెపిల్ల 15 రోజుల వరకు గెంతుతూ హుషారుగానే ఉంది. మందలో ఉండగా, ఏదో జంతువు దాని కడుపులో పొడిచింది. పొట్ట కింది భాగంగా చిన్న గడ్డగా మారి రోజురోజుకి పెరగింది. పొట్ట అడుగులో బక్కి పగిలి మూడో వంతు పేగులు బయటకు వచ్చి వేలాడుతుండడంతోపశు వైద్యశాలకు బుధవారం తీసుకువచ్చారు. గొర్రెపిల్లను పరిశీలించిన అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య గంటన్నరకు పైగా శస్త్ర చికిత్స చేశరు.. పేగులు, పొట్ట భాగాలను బక్కిలోకి వేసి పగిలిన పొట్ట భాగాన్ని మూడు వరుసలుగా కుట్టువేశారు. ఈ శస్త్ర చికిత్సలో సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్, హరికృష్ణ పాల్గొన్నారు.



కోదాడలో గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స చేస్తున్న పశు వైద్యులు

వాలీబాల్ జాతీయ కెప్టెన్‌గా సింధు ఎంపిక



తుంగతుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పదో తరగతి చదువుతున్న కె. సింధు అంతర్జాతీయ వాలీబాల్ టీంకు కెప్టెన్‌గా ఎంపికైంది. పుణెలో జరిగిన జాతీయ పోటీల్లో ప్రతిభ చాలింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. సంధ్యారాణి, సిబ్బంది అభినందించారు.

ఆధునిక వసతులతో అన్నసత్రం

● ఏకకాలంలో 1000 మందికి వితరణ

● రోజులో 2 వేల నుంచి 5 వేల మందికి అవకాశం



అన్నసత్రంలో భోజనం చేస్తున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా ఆధునిక వసతులతో అన్నదానం సత్ర భవనం అందుబాటులోకి వచ్చింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలో బస్టాండ్ సమీపంలో కొత్తహంగులతో నూతన భవనం నిర్మించారు. విశాలమైన భవనంలో కూరగాయలు నిల్వ చేసేందుకు గదులు, పెరుగు, పాలు కోసం ఫ్రిజ్‌లు, ప్రముఖులకు ప్రత్యేకంగా భోజనం చేసేందుకు వసతులు సమకూర్చారు. ఉచితంగా, పరిశుభ్రంగా పోషకాహారం, నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనం అందిస్తున్నారు.

నూతన అన్నదాన సత్ర భవనంలో రెండు డైనింగ్ హాళ్లలో ఏకకాలంలో 1,000 మంది భోజనం చేసేలా పెద్దగా నిర్మించారు. రెండు వెయిటింగ్ హాళ్లు, 12 స్టోర్‌రూం, కేటాయించిన భూమిలో 25శాతం సువిశాలమైన వంటల గది, కూరగాయలు భద్రపర్చేందుకు గదులు, పెరుగు, పాలు కోసం ఫ్రిజ్, 20మంది ప్రముఖులకు ప్రత్యేకగదులను అందుబాటులోకి తెచ్చారు. భక్తులు కూర్చుని భోజనం చేసేందుకు కుర్చీలు, టేబుళ్లు దాత సహకారంతో భవన ఆవరణలో ప్రత్యేకంగా జల ప్రసాదం సిద్ధం చేశారు. తొలుత 200 మందితో ప్రారంభించిన అన్నదాన పథకం 1000 మందికి చేరింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు 1000 నుంచి 1,500 మంది భక్తులకు అన్నదాన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు విడతల వారీగా 2వేల నుంచి 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించే సౌకర్యం ఉంది.

కొండకింద ఆధ్యాత్మిక వాడలో సుమారు రూ.23 కోట్లు వెచ్చించి 2.07ఎకరాలకు 1.20 ఎకరాల్లో నూతన భవనం నిర్మించారు. నవంబరు 30న ఈ అన్నసత్ర భవనాన్ని ప్రారంభించారు. 2021లో నిర్మాణం చేపట్టగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా గణపవరం దాత వేగేశ్న అనంతరకోటీరాజు అందించిన విరాళం రూ.14కోట్లు, మిగతాపనులు కావాల్సిన నిధులు వైటీడీఏ (భవనం పునాదులు), దేవస్థానం (గ్యాస్‌స్టౌవ్, పైపులైన్, బాయిలర్లు, ఇతర సామాగ్రి) భాగస్వామ్యంతో అన్నదానం కొనసాగుతోంది. ఆధునిక వంటపరికరాలు,పాత్రలు శుభ్రంచేసే యంత్రాలు ఏర్పాటుచేశారు.

రోజు 1000 మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నాం



ప్రస్తుతం రోజుకు 1000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నాం. నిత్యం 2వేల నుంచి 5వేల మంది భక్తులకు వితరణ చేసే సౌకర్యం ఉంది. విశాలమైన భవనంలో సౌకర్యవంతంగా వసతుల నడుమ నిత్యం భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. భక్తులు విరివిగా అందజేసే విరాళాలతో మరింత భక్తుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం.

భాస్కరాయణీ నరసింహమూర్తి, దేవస్థానం అనువంశిక ధర్మకర్త

స్వార్థరహితమే దైవసన్నిధికి మార్గం



వార్షికోత్సవాల్లో ప్రసంగిస్తున్న ఫాదర్ రాజారెడ్డి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మఠంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వార్థరహిత జీవనం సాగించే వారికే దైవసన్నిధికి చేరుకునే మార్గం సిద్ధిస్తుందని విచారణ గురువు ఫాదర్ గోగుల రాజారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రం శౌరీనగర్‌లోని పునీతశౌరీ దేవాలయ వార్షికోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవాళి జీవనసరళి పాపభీతి, ఆధ్యాత్మిక చింతనలతో సాగాలని ఉద్బోదించారు. ప్రతీ వ్యక్తిలో దైవత్వాన్ని చూడాలన్నారు. సాటిమనిషికి సాయం చేయడంలోనే దైవసేవ దాగి ఉంటుందన్నారు. ఏసుమార్గంలో నడవాలన్నారు. సాయంత్రం పురవీధుల్లో బాల ఏసు ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై భక్తులు గీతలాపాన చేస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో విచారణ గురువులు మరయ్య, అశోక్, జోసఫ్, శౌరి, సాగర్ సిస్టర్లు, పునీత దేవాలయ కమిటీసభ్యులు, గ్రామపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను అభిషేకరించి, తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండీజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 15,23,421 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

వైభవంగా నిత్యకల్యాణం



మట్టపల్లిలో గరుడసేవలో భక్తులు

మఠంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో బుధవారం నిత్యకల్యాణ్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. కల్యాణంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెత్తనుంచి ఎరువుల తయారీ



గుట్టలో డంపింగ్ చెత్తను బయోమైనింగ్ చేస్తున్న యంత్రం

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో రెండో వార్డు శ్మశానవాటికలో గత 10 సంవత్సరాలు డపింగ్ చేసిన చెత్తను సీడీఎంఏ ఆదేశం మేరకు హైదరాబాద్ సాగర్ మోటార్ సంస్థ బయోమైనింగ్ ద్వారా ఎరువులను వేరు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెత్తనుంచి ఉత్పన్నమైన ఎరువులను మునిసిపాలిటిలోని చెట్లకు వినిగిస్తామని, పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ కవర్లను సిమెంట్ ప్యాక్టరీలకు, మిగిలిన పదార్థాన్ని రోడ్డుపై గుంతల మరమ్మతులకు వినియోగిస్తామని ఆయన వివరించారు. ఇలా చెత్తను బయోమైనింగ్ చేయడంతో మునిసిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

మునిసిపాలిటీలో చోరీని బహిర్గతం చేయాలి

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మునిసిపల్ కార్యాలయంలో గత నెల 5వ తేదీన కుట్ర పూరితంగా జరిగిన చోరీని బహిర్గం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్ అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మునిసిపాలిటీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, నాయకులు రాయగిరి బాలకిషన్, కోకల రవీందర్, తుమ్మల ఇస్తారి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ద్వారానే గ్రామాలన్నీ అభ్వృద్ధి చెందుతున్నాయని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. బుధవారం గుట్టలో జిల్లా స్థాయి ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ద్వార జరిగే అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మొట్ట మొదటగా జిల్లా ఇన్‌చార్జీగా ఎంపికై గుట్టకు వచ్చినందులకు హర్షవర్ధన్‌రెడ్డిని బీజేపీ నాయకులు కార్యకర్తలు పూలమాల శాలువాతో సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, జిల్లా కన్వీనర్ పాశం భాస్కర్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, దాసరి మల్లేశం, జగన్మోహన్‌రెడ్డి, రచ్చ శ్రీనివాస్, గుంటిపల్లి సత్యనారాయణ, కర్రె ప్రవీణ్, చంద్రమౌళి, బుచ్చిబాబు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిన జర్నలిస్టులు

భువనగిరి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భీమా పథకం, కొత్త అక్రెడిటేషన్ కార్డుల జారీ, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర డిమాండ్లతో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు భువనగిరి నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలివెళ్లారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యంబ నర్సింహులు, పోతంశెట్టి కరుణాకర్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు భువనగిరి మల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కూరెళ్ల మల్లేశం, పట్టణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు పాములపర్తి లక్ష్మీనారాయణ, చెదురుపల్లి శ్రీచరణ్, పట్టణ ప్రింట్ మీడియా కార్యదర్శి కందుల శ్రీనివాస్, మెరుగు చెన్నయ్య, ఇబ్రహీం, మల్లేష్‌చారి, నవీన్, జహంగీర్ తదితరులు హైదరాబాద్ ధర్నాలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేతగా జిల్లా జట్టు



రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచిన జిల్లా జట్టు

ఆలేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా హాలియాలో ఇటీవల నిర్వహించిన 51వ కబడ్డీ బాలికల జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా బాలికల జట్టు పాల్గొని తమక్రీడా ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచిందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య బుధవారం స్థానిక విలేకరులతో తెలిపారు. మొదటి రోజు సంగారెడ్డి జిల్లా జట్టుతో జరిగిన కబడ్డీ పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు పాల్గొని గెలుపొందగా, రెండవ రోజు జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్ పోటీల్లో నిర్మల్ జట్టుపై 18 పాయింట్ల తేడాతో విజయ విజేతగా నిలిచిందన్నారు. కబడ్డీ బాలికల జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో యాదాద్రి భువనగిరి బాలికల జట్టు విజయం సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, కోశాధికారి గంధమాల కుమార్, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, సూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పూల చంద్రకుమార్, మంగళగిరి నరేష్, రాహుల్, ఈశ్వర్ పలువురు విజేత జిల్లా జట్టును కోచ్ నిర్మల, మేనేజర్ సాత్వికలను అభినందించినట్లు నాగయ్య తెలిపారు.

దివ్యాంగుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి



ఆలేరులో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో లక్ష్మి

రామన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల్లోని నైపుణ్యాలను వెలికి తీయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిరీష అన్నారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని భవిత సాహితీ విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో గవ్వ జ్యోతి సమక్షంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రామన్నపేట డాక్టర్లు వరుణ్‌రెడ్డి, ఉదయ్ కలిసి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో మొత్తం 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి లింగారెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, శ్రీశైలం, రిసోర్స్ పర్సన్ జంగమ్మ, ఫిజియోథెరపిస్ట్ శ్వేత, షఫీ పాల్గొన్నారు.

ఆలేరు : సమాజంలోని దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ఆదరణ చూపి వారిలో చైతన్యాన్ని నింపాలని మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి కోరారు. ఆలేరులోని హైస్కూల్ పక్కన ఉన్న భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోరెడ్డి రంగయ్య, భారతమ్మ, శ్రీనివాస్, రమేష్, రాధిక, ఆకుల దేవి, అశోక్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యయులు రాధిక, సరిత, కాంత్రికూమారు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: ఎంఈవో ప్రభాకర్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ నరసింహరావు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణ, సుధామణి, కేర్‌టేకర్ పెంటమ్మ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా అవమానించవద్దని స్థానిక ఎంఈవో శరత్‌యామిని అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఎమ్మార్సీలో వేర్వేరుగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్: ఎంఇవో గురువారావు, యుపీఎస్ హెచ్ఎం గంజి మారయ్య, ఫిజియోథెరపిస్ట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : ఎంఈవో తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీలత, ఐఈఆర్‌పీ షబానా, ప్రత్యేక ఎడ్యుకేటర్ విమలమ్మ, ఉపాధ్యాయులు అరుణ, సౌజన్య, రాములు, ఎమ్మార్సీ సిబ్బంది మోహన్, ఉమ, యాదగిరి పాల్గొన్నారు.

పాఠశాలకు గేట్ ఏర్పాటు చేయరూ..



రాత్రివేళ పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తున్న ఆకతాయిలు

- రాత్రి వేళలో మద్యం సేవిస్తున్న ఆకతాయిలు
- ఉదయాన్నే దర్శనం ఇస్తున్న మద్యం సీసాలు

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట పట్టణం నడిబొడ్డున ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో ప్రతీ రోజు రాత్రి అసాంఘిన కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పాఠశాల మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉండటంతో పాటుగా పాఠశాలకు గేట్‌లేకపోవడంతో రాత్రి వేళలో కొందరు మద్యం సేవించేవారికి అడ్డాగా మారింది. మరోవైపు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. దానికి తోడుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల మురికినీరు. గుట్టకు విచ్చేసే భక్తులు, స్థానిక ప్రజలు రాత్రివేళలలో పాఠశాల మైదానంలోనే మలమూత్ర విసర్జన చేయడం, చెత్త చెదారం వేయడంతో అక్కడి వాతావారణ పూర్తిగా అపరిశుభ్రంగా మారుతోంది. మరోవైపు పాఠశాలకు నైట్ వాచ్‌మన్ సైతం లేకపోవడం పెద్ద తలనొప్పిగా మారింది. ప్రధానంగా పాఠశాలకు తక్షణమే గేట్ ఏర్పాటు చేస్తే కొంతవరకు అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డుకట్ట వేయవచ్చునని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

తక్షణమే గేటు ఏర్పాటుచేయాలి



పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు తక్షణమే గేట్ ఏర్పాటుచేయాలి. రాత్రివేళలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాలకు అరికట్టవేయాలి. విద్యార్థులకు చక్కని వాతావరణ కల్పించే విధంగా తగిన చర్య లు తీసుకోవాలి. రోడ్డు వైపునుంచి ఉన్న దుకాణాల ద్వార విచ్చే వ్యర్థ పదార్థములు, మురికినీరు రాకుండ చర్యలు తీసుకోవాలి.

– పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా

రాత్రి వేళలో పాఠశాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి, భద్రత కల్పించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా. ప్రధానంగా పాఠశాలకు గేటు లేకపోవడంతో రాత్రివేళలో పాఠశాలను అపరిశుభ్రం చేస్తున్నట్లు సమా చారం అందింది. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడానికి గేట్ ఏర్పాటు చేసే వరకు ప్రతీ రోజు రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేసేలా పోలీసుల దృష్టికి తీసుకు వెళతా.

-శరత్‌యామిని, ఎంఈవో, యాదగిరిగుట్ట

శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ ఉద్యమానికి మలుపు



భువనగిరిలో శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి గంజ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి ప్రాణత్యాగంతోనే మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని, రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన త్యాగమే ప్రధాన కారణమని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రీకాంతాచారి వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవీ.కిరణ్‌కుమార్, చింతల కిష్టయ్య, ఎనబోయిన అంజనేయులు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కర్తాల శ్రీనివాస్, ఇట్టబోయిన గోపాల్, పెంట నరసింహ, అజీమ్‌ఉద్దీన్, బబ్లూ, నితీష్, సైదులు, అంజద్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

భువనగిరి గంజ్ : తెలంగాణ ఉద్యమంలో ఆత్మార్పణ చేసుకున్న మలిదశ తెలంగాణ విద్యార్థి ఉద్యమ అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి అని బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణచారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వేముల అశోక్, సుర్వి శ్రీనివాస్, మాయ దశరథ, లక్ష్మీనారాయణ, పట్నం కపిల్, కోళ్ల బిక్షపతి, రత్నపురం బలరాం, నరసింహరావు పాల్గొన్నారు.

రాజాపేట : తెలంగాణ ఉద్యమ నేత శ్రీకాంతాచారి వర్ధంతిని రాజాపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సట్టు తిరుమలేష్, ఎర్రగోకుల జశ్వంత్, సందిల భాస్కర్, బెడిద వీరేశం, గుర్రం నర్సింహులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక

మోత్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ స్థానాలకు పనకబండ నుంచి లోతుకుంట రేణుకఅనిల్, రాగిబావి నుంచి మెండు శ్రీవాణిచంద్రశేఖర్‌రెడ్డి, పాటిమట్ల నుంచి బండ స్వరూప సంజీవరెడ్డి, దాచారం నుంచి చిల్లర లింగమ్మవీరయ్య, ముశిపట్ల నుంచి పైళ్ల వెంకట్‌రెడ్డి, సదర్శాపురం నుంచి చిలుకల ప్రకాష్, పాలడుగు నుంచి సింగిరెడ్డి నర్సింహారెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు అయ్యప్ప పడిపూజ

ఆలేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలేరులోని సాయిబాబా ఆలయంలో గురువారం (నేడు) గురు దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ బొట్ల పరమేశ్వర్ బుధవారం విలేకరులతో తెలిపారు. ఆలయంలో ఉదయం సాయిబాబాకు కాకడ హారతితో పూజలు ప్రారంభమవుతాయని అనంతరం అభిషేకం, అర్చనలు నిర్వహిస్తారని, 11 గంటలకు అయ్యప్పస్వామి మహాపడిపూజ జరుగుతుందని తెలిపారు. ఈ పూజకు అయ్యప్ప గురుస్వాములు, మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. అనంతరం అయ్యప్పస్వాములకు భిక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మోత్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రి, వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 5న మోత్కూరు మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కామినేని ఆస్పత్రి పీఆర్‌వో సతీష్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నుంచి లక్ష్మయ్య సస్పెన్షన్

భువనగిరి రూరల్:: మండలం నందనం గ్రామానికి చెందిన లక్ష్మయ్య పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



వలిగొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధధవారం మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసుల సత్తయ్యగౌడ్ ఎమ్మెల్యే సమక్షంలో భువనగిరిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ చిక్కా వెంకటేశ్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరాల వెంకట స్వామి, ఉడుత సత్యనారాయణ, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని వేములకొండ, పులిగిల్ల గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్యులు ఏర్పుల యాదయ్య, అంబటి భాగ్యలక్ష్మి వెంకటేశం, పద్మ నర్సింహా, పద్మ దుర్గయ్య, శివరంజని ప్రభాకర్ ఉన్నారు. కార్యక్రమంలో మత్స్యగిరి దేవస్థాన ఛైర్మన్ నరేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు వెంకటేశం, రాములు, రసూల్ పాల్గొన్నారు.

బీబీనగర్: పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయంకోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోళి సంతోష్ రెడ్డితో పాటు మరి కొంత మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు గోళి పింగల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి పంజాల శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్, అక్బర్, శ్రీధర్, జహంగీర్, అంజనేయులు శర్మ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న వైన్స్ దుకాణాలను ఊరి బయటకు తరలించడంలో సహకరించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డిని బుధవారం పట్టణ అఖిల పక్ష నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మహిళా అధ్యక్షురాలు మెరుగు శశికళ, వివిధ సంఘాల నాయకులు సీత శ్రీరాములు, నేతాజి, బాలయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, పాండు పాల్గొన్నారు.

మన కులపోళ్ల ఓట్లెన్ని?

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. మెజార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీలు దృష్టిసారించాయి. అన్నిపార్టీలు స్థానికంగా బలపడే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి.

చేపట్టేబోయే పనులపై ప్రచారం

ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతీ గ్రామపంచాయతీలోనూ కులాలవారీగా ఓటర్ల గణనను సిద్ధం చేసుకున్నాయి. గ్రామాల్లో చేపట్టేబోయే అభివృద్ధి పనులపై ఓటర్లకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఏయే సామాజిక వర్గాలనుంచి ఎంత మేరకు ఓటింగ్‌కు పొందవచ్చన్న లెక్కల్లో నిమగ్నమయ్యారు. గతంలో పోటీచేసి అనుభవం ఉన్న సీనియర్ నేతలు అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించే అవకాశం ఉన్నందున, వారి సేవలను వినియోగించుకునేందుకు ప్రధాన పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈమేరకు మాజీ ప్రజాప్రతినిధులతోనూ తాజా రాజకీయ పరిస్థితులపై సంప్రదింపులు జరుపుతున్నారు. అభ్యర్థుల గెలుపుకోసం తీసుకోవాల్సిన వ్యూహాలతోపాటు సామాజికవర్గాల ఓటర్లను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీలకు మహిళలకు 195 స్థానాలు, జనరల్ కింద 232 స్థానాలకు రిజర్వేషన్లు కల్పించారు. వీటిలో జిల్లాలోని 100 శాతం ఎస్టీ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలతోపాటు పలు గ్రామాల్లో ఎస్సీ జనాభా ఆధారంగా జిల్లాలో 20 స్థానాలు మహిళలకు, 29 స్థానాలు జనరల్‌కు కేటాయించారు. ఎస్సీ మహిళలకు 33 గ్రామపంచాయతీలు, ఎస్సీ జనరల్‌లో 41 పంచాయతీలు, 47 బీసీ మహిళలకు, 58 బీసీ జనరల్‌కు, జనరల్ కేటగిరీలో 65 మహిళలకు, 104 జనరల్‌గా రిజర్వేషన్లు కేటాయించారు.

మొదటి విడత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



వలిగొండలో నామినేషన్ల లిస్టును నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేసిన అధికారులు

ఆలేరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీల్లో మొదటి విడతగా ఈ నెల 11న ఎన్నికలు జరుగనున్నాయి. బుధవారం రోజు పలువురు ఉపసంహరించుకున్నారు. ఆలేరు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో బైరాంనగర్ ఏకగ్రీవం కావడంతో మిగతా 15 గ్రామ పంచాయతీలలో 49 మంది బరిలో ఉన్నారు. 140 వార్డులకు గాను బైరాంనగర్‌లో 8 వార్డులు, కొలనుపాక -1, గుండ్లగూడెం -1, మంతపురి -1, కందిగడతండా -1, మొత్తం 12 వార్డులో ఏకగ్రీవం కాగా మిగతా 128 వార్డులకు 304 మంది పోటీలో ఉన్నారు. ఈ రోజు సాయంత్రం సర్పంచ్ వార్డు సభ్యులకు గుర్తులను కేటాయించారు.

యాదగిరిగుట్ట రూరల్: మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలు, 198 వార్డుల సభ్యులకు గాను ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా 21 సర్పంచ్‌లకు 68 అభ్యర్థులు పోటీలో ఉండగా 198 వార్డు సభ్యులకు గాను 26 వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా 172 వార్డులకు ఈ నెల 11న జరుగునున్న ఎన్నికల బరితో నిలిచారు.

బొమ్మలరామారం: గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడుదల మండలంలో జరిగే 35 గ్రామ పంచాయతీలలో నామినేషన్ల విత్‌డ్రా ప్రక్రియలు ముగియడంతో పాటు ఎన్నికల నిలబడే పోటీదారులకు ఎలక్షన్ గుర్తులు కేటాయించారు. మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీలకు జరిగే ఎన్నికల్లో, లక్ష్మీతండా, రామస్వామి తండా, గోవింద్‌తండా, గ్రామాల్లో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఎన్నికను గ్రామస్థులంతా ఏకగ్రీవం చేసుకున్నారు. రామలింగంపల్లి, మాత్రం సర్పంచ్‌తో పాటు మూడు వార్డులను ఏకగ్రీవంగా చేసుకోగా మిగిలిన 5 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. 283 వార్డులకు పలు గ్రామాలలో 60 వార్డులకు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 31 గ్రామ పంచాయతీలకు ఎన్నికల్లో సర్పంచ్ ఎన్నికలకు 86 మంది, పోటీ చేయగా 223 వార్డులకు 482 పోటీలో ఉన్నారు.

రాజాపేట : మండలం లోని 23 గ్రామ పంచాయతీలకు గాను బుధవారం రెండు పంచాయతీలు ఏకగ్రీవం కాగా 21 పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్ స్థానానికి109 మంది నామినేషన్‌లు వేయగా 44 మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు.63 మంది బరిలో ఉన్నారు.మండలంలో 206 వార్డుమెంబర్లకు 528 మంది నామినేషన్‌లు వేయగా 71 మంది ఉపసంహరించుకున్నారు. 434 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 23 మంది వార్డుమెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపిడివో నాగవేణి తెలిపారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

భువనగిరి రూరల్: రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా బుధవారం నామినేషన్ల పరిశీలన జరిగింది. భువనగిరి మండలంలోని 34 గ్రామ పంచాయతీలో 11 నామినేషన్ క్లస్టర్లను ఏర్పాటు చేసి నవంబరు 30నుంచి డిసెంబరు 2వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా 34 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు గాను 202 నామినేషన్లు , 294 వార్డులకు గాను 743 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం సంబంధిత నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు క్లస్టర్ల వారిగా పరిశీలించారు. 202 సర్పంచ్ స్థానాలకు 138 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు కాగా ఒక్కో అభ్యర్థి రెండేసి సెట్లు నామినేషన్ దాఖలు, వివిధ కారణాల దృష్ట్యా 64 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 743 వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించగా 678 నామినేషన్లు సక్రమంగా ఉండగా మిగితా 65 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు భువనగిరి ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం నామినేషన్లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు మరోసారి ఆర్డీవో స్థాయి అధికారులకు విన్నవించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 5న ఆర్డీవో విచారణ అనంతరం 6న అభ్యర్థుల ఉపసంహరణ అనంతరం పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రకటించి గుర్తులు కేటాయిస్తామన్నారు.

బీబీనగర్: మండలంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ముగియడంతో బుధవారం ఆయా క్లస్టర్లలో నామినేషన్ల పరిశీలన పూర్తి చేశారు. మండలంలో 34 సర్పంచ్ స్థానాలకు గాను 177నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో 53 నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా 124 నామినేషన్లు సరైనవిగా గుర్తించారు. 284 వార్డులకు గాను 735 నామినేషన్లు రాగా పరిశీలనలో 88 నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా 648నామినేషన్లు ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఉన్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వలిగొండ : స్థానిక సంస్థల నామినేషన్ల ప్రక్రియ బుధవారం జరిగింది. మండలంలో 37 గ్రామాలకు సర్పంచ్‌లు, 330 వార్డు సభ్యులకు నామినేషన్లను ఎన్నికల అధికారులు స్వీకరించారు. 254 సర్పంచ్‌లకు, 882 వార్డు సభ్యులకు నామినేషన్లు వచ్చాయి. వాటిలో మొదటి రోజున 17 మంది అభ్యర్థులు సర్పంచ్‌లకు, 14 మంది అభ్యర్థులు వార్డు సభ్యులకు, రెండవ రోజున 79మంది సర్పంచ్‌లు, 189 వార్డు సభ్యులు, చివరి రోజున 158 సర్పంచ్‌లు, 679 మంది వార్డు సభ్యులు నామినేషన్లు వచ్చాయి. కాగా బుధవారం ఆ నామినేషన్లను అధికారులు పరిశీలించారు.

నాగారం పదో వార్డుకు ఒకటే నామినేషన్

వలిగొండ: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పరిశీలన ఘట్టం బుధవారం ముగిసింది. కాగా మండలంలోని నాగారం గ్రామ పంచాయతీకి పదో వార్డుకు ఒకే అభ్యర్థి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి మాదాను విక్రమ్‌కుమార్ ఒక్కరే నామినేషన్ వేశారు. అతని గెలుపు లాంఛనప్రాయమైంది. వెంకటాపురం గ్రామ పంచాయతీ 6వ వార్డుకు ఒకటే నామినేషన్ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలపర్చిన కాడిగల్ల మమత ఒకే నామినేషన్ వచ్చింది.

మందకొడిగా మొదలు

సంస్థాన్ నారాయణపురం: రెండో దశ పంచాయతీ ఎన్నికల నిర్వాహణకు తొలిరోజు నామపత్రాల స్వీకరణ మందకొడిగా సాగింది. సంస్థాన్ నారాయణపురం మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు ఏడు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ప్రమోద కుమార్ తెలిపారు.

చౌటుప్పల్ రూరల్: మండలంలో మూడవ విడత గ్రామపంచాయతీ నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. పంతంగి, అంకిరెడ్డిగూడెం, నేలపట్ల, చిన్నకొండూర్, కొయ్యలగూడె, దేవల్మనాగారం, దండుమల్కాపురం క్లసర్ల కేంద్రలలో నామినేషన్లను స్వీకరించారు.

మోత్కూరు : మూడో విడత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడంతో మోత్కూరు మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించారు. మండలంలో మూడు క్లస్టర్లు ఏర్పాటు చేసి పది గ్రామపంచాయతీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అనాజిపురం, పాటిమట్ల నామినేషన్ కేంద్రాలను ఎన్నికల మండల ప్రత్యేక అధికారి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి పరిశీలించారు. తహసీల్దార్ పి.జ్యోతి, ఆర్ఐ సుమన్ ఆయన వెంట ఉన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ACM - 9985411394 Bhuvanagiri ACO - 7660936837, Yadagirigutta SR - 8688028818, Aler SR - 9390691646
Mothkuru SR - 9390691646, Atmakuru.M.SR - 9182457541, Valigonda SR - 8374205094, Chowtuppal SR - 9848157092
సంప్రదించగలరు : భువనగిరి,యదగిరిగుట్ట, ఆలేరు,వలిగొండ,మోత్కూరు, ఆత్మకూరు,యం,చౌటుప్పల్